RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 106 | మే 08 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 106 | May 08 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## 2లక్షల రుణమాఫీ చూపించండి

లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోండి

పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్‌కు వేముల సవాల్

2

## కరీంనగర్‌లో రాజకీయ సెగ

గంగుల కార్యాలయంపై దాడి, కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం



**కరీంనగర్ జనసంఘర్షణ:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. గురువారం నాడు బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలతో కరీంనగర్, హుజూరాబాద్ ప్రాంతాలు రణరంగంగా మారాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కేంద్రమంత్రి బండి సంజయ్‌ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన కొద్దిసేపటికే బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి దాడులకు దిగారు. క్యాంప్ ఆఫీస్‌పై దాడి: కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో విరుచుకుపడ్డారు. కార్యాలయ కిటికీ అద్దాలను పగులగొట్టారు. వాహనం ధ్వంసం: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారును లక్ష్యంగా చేసుకున్న ఆందోళనకారులు, రాళ్లతో దాడి చేసి అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై కూడా దాడికి ప్రయత్నించగా

➤ మిగతా 2వ పేజీలో..

## పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తాం

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం - మంత్రి పొంగులేటి




**హైదరాబాద్ జనసంఘర్షణ:** రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడం, భూ యాజమానులకు వారి భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని, ఇల్లు మరియు భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 'ఇందిరమ్మ ఇండ్లు' అనే మహత్తర కార్యక్రమం ద్వారా సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి ఒక గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. పథకం అమలులో కలెక్టర్లకు పూర్తి అధికారాలు

➤ మిగతా 2వ పేజీలో..

## హల్దీ వాగులో విషాదం

**ఈతకు వెళ్లి ముగ్గురు స్నేహితుల దుర్మరణం**

**సిద్దిపేట జనసంఘర్షణ** సరదాగా గడపాలని వెళ్లిన ఆ ముగ్గురు స్నేహితుల ప్రాణాలను నీరు బలితీసుకుంది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో జరిగిన ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్, వికాస్, ఆనంద్ రెడ్డి (ముగ్గురి వయసు 27 ఏళ్లు) ప్రాణ స్నేహితులు. బుధవారం తూప్రాన్‌లో జరిగిన ఒక వివాహ వేడుకకు

➤ మిగతా 2వ పేజీలో..

## పదేళ్లలో విశ్వనగరంగా హైదరాబాద్:

నాస్కామ్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

2

## తమిళనాట వీడని రాజకీయ సందిగ్ధం

గవర్నర్‌తో మరోసారి విజయ్ భేటీ



**చెన్నై జనసంఘర్షణ:** తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ క్లిష్టంగా మారుతోంది. టీవీకే (ఎంఖ) అధినేత విజయ్ గురువారం మరోమారు రాజ్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌తో భేటీ అయ్యారు. అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌ను కోరారు. అయితే, మెజార్టీకి అవసరమైన స్పష్టమైన మద్దతు లేఖలను సమర్పించాలని గవర్నర్ సూచించడంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగుతోంది.

➤ మిగతా 2వ పేజీలో..

## గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నిప్పులు నేడు 'లోక్ భవన్' ముట్టడికి పిలుపు

**చెన్నై జనసంఘర్షణ:** తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు వ్యవహారం తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే (ఎంఖ) పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు సిద్ధమైంది. గవర్నర్ వైఖరిని నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది. తమిళనాడు అసెంబ్లీలో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ (5 సీట్లు), వామపక్షాల మద్దతుతో టీవీకే మెజారిటీకి చేరువలో ఉన్నప్పటికీ, గవర్నర్ కాలయాపన చేయడం వెనుక



రాజకీయ కుట్ర దాగి ఉందని నేతలు మండిపడుతున్నారు.

➤ మిగతా 2వ పేజీలో..

## పంజాబ్‌లో ఈడీ సోదాలు

అపార్ట్‌మెంట్ పైనుంచి కరెన్సీ బ్యాగుల విసిరివేత

**చండీగఢ్ జనసంఘర్షణ:** పంజాబ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఙణ) అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో ఒక విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. ఈడీ దాడుల భయంతో నిందితులు లక్షలాది రూపాయల నగదు ఉన్న బ్యాగులను అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకు విసిరేశారు. సినిమా ఫక్కీలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు

➤ మిగతా 2వ పేజీలో..

## బెంగాల్ అసెంబ్లీని రద్దు

**ముగిసిన మమతా బెనర్జీ పాలన**

**కోల్‌కతా జనసంఘర్షణ :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీని రద్దు చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేయడంతో మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారికంగా బర్తరఫ్ అయింది. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు మమతా బెనర్జీ నిరాకరించడంతో ఈ రాజ్యాంగపరమైన చర్య అనివార్యమైంది.

➤ మిగతా 2వ పేజీలో..

# పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తాం

**మొదటిపేజీ తరువాయి..** కల్పించామని చెబుతూనే, లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా పూర్తి పారదర్శకత పాటించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని, అర్హులైన వారికే ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించే యోచనలో ప్రభుత్వం ఉందని, అలాగే నిర్మాణంలోఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని వివరిస్తూ, లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో ప్రజల సౌకర్యార్థం అదనపు తహశీల్దార్లను నియమించనున్నట్లు మంత్రి ప్రకటించారు. రెవెన్యూ మరియు అటవీ శాఖల మధ్య నెలకొన్న భూ వివాదాల పరిష్కారానికి ఉమ్మడి సర్వేలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఆర్డీవోలకు విస్తృత అధికారాలు కల్పించడమే కాకుండా, భూ రికార్డుల్లో ఖచ్చితత్వం మరియు పారదర్శకత కోసం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించి ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు ఇతర కీలక నేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి పునరుద్ఘాటించారు.

# కరీంనగర్‌లో రాజకీయ సెగ

**మొదటిపేజీ తరువాయి..** భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. హుజూరాబాద్‌లో ఉద్రిక్తత: కరీంనగర్ నుంచి కౌశిక్ రెడ్డిని పోలీసులు హుజూరాబాద్‌కు తరలించారు. అయితే అక్కడ కూడా బీజేపీ శ్రేణులు ఆయన క్యాంప్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య కర్రలతో పరస్పర దాడులు జరిగాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేశారు. దాడులకు పాల్పడిన పలువురు బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం కరీంనగర్, హుజూరాబాద్ పట్టణాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.

# హల్దీ వాగులో విషాదం

**మొదటిపేజీ తరువాయి..** హాజరైన వీరు, గురువారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్న వీరు, ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం వాగులో ఈత కొట్టాలని భావించారు. అయితే, ఆ ప్రాంతంలో నీటి లోతుపై సరైన అవగాహన లేకపోవడంతో వాగులోకి దిగిన ముగ్గురూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు.

పెళ్లి వేడుకలో సంతోషంగా గడిపిన యువకులు, ఇంటికి చేరుకోకముందే విగతజీవులుగా మారడంతో నర్సాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదకరమైన వాగులు, జలాశయాల వద్దకు వెళ్లేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

## 2లక్షల రుణమాఫీ చూపించండి

**లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోండి**

**పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్‌కు వేముల సవాల్**

**హైదరాబాద్, మే 7 :** రాహుల్ గాంధీ చెప్పినట్టు ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ జరిగి ఉంటే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా.. నువ్వు సిద్ధమా అంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్ విసిరారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సవాల్ విసిరారు. రూ.50వేల కోట్ల రుణమాఫీ చేస్తామని కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఇప్పటివరకు మాఫీ చేశారని వెల్లడించారు. రుణమాఫీపై ఇచ్చిన హామీ గురించి, రేవంత్‌రెడ్డి రుణమాఫీ ఎందు చేయడం లేదని రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నామని అందులో తప్పేమిలేదని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌తోనే పదేళ్ల పాటు రైతన్నలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. 2009 నుంచి కేటీఆర్ అప్రతిహతంగా ఎమ్మెల్యేగా ఎన్నుకోబడుతున్నారని, పది సంవత్సరాలు ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా పేరొందిన వ్యక్తని ప్రశంసించారు. జాతీయ మీడియా కూడా కేటీఆర్‌ను జాతీయ స్థాయి నాయకుడిగా గుర్తించిందని వివరించారు. కేటీఆర్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఒక్కసారైనా ఎమ్మెల్యేగా మహేష్‌కుమార్ గెలవలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మెప్పుకోసం అడ్డగోలుగా, పీసీసీ స్థాయిని మరిచిపోయి , ధనం, అధికార అహంకారంతో మాట్లాడుతు న్నారని విమర్శించారు. నీచస్థాయి మాటలు మాట్లాడితే తాము కూడా మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# తమిళనాట వీడని రాజకీయ సందిగ్ధం

**మొదటిపేజీ తరువాయి..** ఈ భేటీపై లోక్‌భవన్ అధికారిక ప్రకటన విడుదల చేస్తూ.. విజయ్ వద్ద ప్రస్తుతం తగిన సంఖ్యాబలం కనిపించడం లేదని, పూర్తి మెజార్టీతో రావాలని గవర్నర్ సూచించినట్లు పేర్కొంది. అయితే, మెజార్టీ నిరూపించుకునే వరకు ఇతర పార్టీలను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించబోమని గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, ప్రస్తుతం టీవీకే ఆ మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతు ప్రకటించగా, ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ పార్టీలు సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ ఇంకా అధికారిక లేఖలు అందాల్సి ఉంది. డీఎంకే కూడా అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకేకే తొలి అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడింది.

మరోవైపు, విజయ్ తన నిరాడంబరతను చాటుకుంటున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వం కేటాయించిన ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను ఆయన సున్నితంగా తిరస్కరించారు. ప్రమాణ స్వీకారం పూర్తికాకముందే అదనపు భద్రత, ప్రభుత్వ వాహనాలు వద్దని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. దీంతో ఆయన తిరిగి ఇచ్చిన వాహనాలను వెనక్కి తీసుకున్నట్లు పోలీసు శాఖ ధ్రువీకరించింది. గవర్నర్‌ను కలిసేందుకు వెళ్ళినప్పుడు కూడా విజయ్ తన సొంత వాహనాన్ని వాడటం విశేషం. మే 4న ఫలితాలు వెలువడినప్పటి నుండి విజయ్ నివాసం వద్ద భద్రత పెంచిన అధికారులు, ఆయన ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు కూడా సిద్ధం చేస్తున్నారు. సంఖ్యాబలంపై సందిగ్ధం తొలగితేనే తమిళనాట కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది.

# గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నిప్పులు నేడు 'లోక్ భవన్' ముట్టడికి పిలుపు

**మొదటిపేజీ తరువాయి..** లోక్ భవన్ ముట్టడి: చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం 'లోక్ భవన్'ను నేడు కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించనున్నాయి. రాష్ట్రవ్యాప్త ధర్నాలు: చెన్నైతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వామపక్షాల మద్దతు: ఈ ఆందోళనలకు సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. "ప్రజలు మార్పును కోరుకుని తీర్పు ఇచ్చారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు" అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ ముట్టడి పిలుపు నేపథ్యంలో తమిళనాడు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే టీవీకే కార్యకర్తలు ఆందోళనలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా తోడవడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాన పట్టణాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బలగాలను మోహరించారు.

# పంజాబ్‌లో ఈడీ సోదాలు

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఏం జరిగింది? గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లో భూ వినియోగ అనుమతుల మార్పిడిలో జరిగిన భారీ అవకతవకలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నితిన్ గోహల్ అనే వ్యక్తికి, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఓఎస్డీ (రూరల్) రజబీర్ ఘుమాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం చండీగఢ్, పంజాబ్‌లోని పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు, బిల్డర్ల కార్యాలయాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు.

సినిమాను తలపించేలా..

మొహాలీలోని ఖరార్ ప్రాంతంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లోకి ఈడీ అధికారులు ప్రవేశించగానే, లోపల ఉన్న వ్యక్తులు భయంతో రూ. 500 నోట్ల కట్టలతో నిండిన రెండు బ్యాగులను కిటికీలోంచి కిందకు విసిరేశారు. సరిగ్గా అదే సమయానికి అపార్ట్‌మెంట్ కింద కారుతో సిద్ధంగా ఉన్న ఒక డ్రైవర్, ఆ బ్యాగులను అందుకుని అక్కడి నుంచి వేగంగా పరారయ్యాడు.

నోట్ల కట్టల బ్యాగులు కింద పడటం, వ్యక్తి వాటిని తీసుకుని వెళ్లడం వంటి దృశ్యాలను ఎవరో మొబైల్‌లో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా వైరల్‌గా మారాయి. అయితే ఈ ఘటనపై ఈడీ అధికారులు ఇంకా అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. భూ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు.

# బెంగాల్ అసెంబ్లీని రద్దు

**మొదటిపేజీ తరువాయి..** అసెంబ్లీ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో, రాజ్యాంగ సంక్షోభం తలెత్తకుండా గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 294 స్థానాలకు రెండు విడతలుగా జరిగిన ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడగా, బెంగాల్ ఓటర్లు బీజేపీకి పట్టం కట్టారు. దీంతో రాష్ట్రంలో తొలిసారిగా కమల దళం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. మే 9వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ లోగా శుక్రవారం నాడు బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై తమ నేతను ఎన్నుకోనుంది. నందిగ్రామ్ వేదికగా మమతా బెనర్జీపై సంచలన విజయం నమోదు చేసిన సువేందు అధికారి పేరు ముఖ్యమంత్రి రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది.

మరోవైపు, ఈ ఓటమిని జీర్ణించుకోలేని మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసలు విలన్ ఎన్నికల సంఘమేనని ఆరోపిస్తూ, రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఆమె భీష్మించుకున్నారు. అయితే గవర్నర్ ఉత్తర్వులతో తృణమూల్ కాంగ్రెస్ పదేళ్ల సుదీర్ఘ పాలనకు తెరపడినట్లయింది. శనివారం జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సవీరిక్ భట్టాచార్య వెల్లడించారు. ఈ పరిణామంతో బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది.

## పదేళ్లలో విశ్వనగరంగా హైదరాబాద్: నాస్కామ్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

ముంబై: అంతర్జాతీయ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుస్తూ, రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. గురువారం ముంబైలో జరిగిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ రైజింగ్ విజన్ 2047

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని మంత్రి వివరించారు. అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నాయని, ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వేగవంతం చేసినట్లు తెలిపారు.

జీసీసీల హబ్‌గా హైదరాబాద్

టెక్నాలజీతో పాటు బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, రక్షణ మరియు స్పేస్ టెక్ రంగాలకు చెందిన అంతర్జాతీయ సంస్థలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (+జజ) ఏర్పాటుకు హైదరాబాద్‌ను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని మంత్రి చెప్పారు. గతేడాది రికార్డు స్థాయిలో 70కి పైగా జీసీసీలు నగరంలో ప్రారంభమయ్యాయని, ఈ ఏడాది మరో 100 కొత్త కేంద్రాలను తీసుకువచ్చి లక్ష మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఆయన వెల్లడించారు.

పెట్టుబడిదారులకు ఆహ్వానం

జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ పనులకే పరిమితం చేయకుండా, వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసిందని శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో ఉన్న నిపుణుల లభ్యతను ఉపయోగించుకుని 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాస్కామ్ చైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

**అమరావతి,మే 7 :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వేదికగా టీడీపీ మహానాడు- 2026 ను నిర్వహించనున్నారు. ఈ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను పార్టీ హైకమాండ్ నియమించింది. మొత్తం 21 కమిటీలను నియమించింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నియమించింది. ఈ మహానాడు మే 27న ప్రారంభమై.. 29వ తేదీతో ముగియనుంది. ఈ మహానాడు నిర్వహణ కోసం మే 6వ తేదీన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ ఈ మహానాడుకు వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ముగింపు సభకు దాదాపు ఏడు లక్షలకు పైగా కార్యకర్తలు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. 21 కమిటీల వివరాలు

# అటవీ శాఖలో 'లంచం' పర్వం: ఏసీబీ ఉచ్చులో బడా చేపలు!

భద్రాచలం మే 07 (జన సంఘర్షణ)

అడవికి రక్షకులుగా ఉండాల్సిన అటవీ శాఖాధికారులు 'అవినీతి' బాట పట్టడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. భద్రాచలం అటవీ డివిజన్ పరిధిలోని పూసుగుప్ప ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో కొన్ని చెట్లు దెబ్బతినడమే ఆ అధికారులకు కాసుల వేటగా మారింది. బాధ్యతగా కేసు నమోదు చేయాల్సిన చోట, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ఏకంగా పది లక్షల రూపాయల భారీ మొత్తానికి బేరసారాలు సాగించడం అటవీ శాఖలోని నైతిక పతనాన్ని సూచిస్తోంది. గురువారం నాడు ఎఫ్‌డీఓ సుజాత తన కార్యాలయంలో రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటూ, డీఆర్‌ఓ కృష్ణయ్యతో కలిసి ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ బృందానికి పట్టుబడటం శాఖా పరంగా పెద్ద దుమారాన్నే రేపింది. ఈ ఘటన కేవలం ఒక లంచం కేసు మాత్రమే కాదు, వ్యవస్థలో పేరుకుపోయిన కుళ్లుకు నిలువుటద్దం. గతంలోనూ కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థకు




చెందిన జిల్లా అధికారి మూడున్నర లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉదంతం మరువక ముందే, ఇప్పుడు ఏకంగా డివిజనల్ స్థాయి అధికారిణి పట్టుబడటం గమనార్హం. అభివృద్ధి పనుల సాకుతో చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి, వాటిని అడ్డం పెట్టుకుని 'సెటిల్మెంట్'లకు పాల్పడటం అటవీ రక్షణ లక్ష్యాన్ని కాలరాయడమే. ఏసీబీ దాడులు జరుగుతున్నా, అధికారులు జైలుకు వెళ్తున్నా వ్యవస్థలో మార్పు రాకపోవడానికి కారణం ఏమిటనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన ఉన్నతాధికారులే అక్రమ సంపాదనకు అలవాటు పడితే, క్షేత్రస్థాయిలో అడవుల సంరక్షణ ఎలా సాధ్యమవుతుంది? రక్షక భటులే భక్షకులుగా మారి సామాన్య ప్రజలను, కాంట్రాక్టర్లను వేధింపులకు గురిచేస్తుంటే అభివృద్ధి కుంటుపడటమే కాకుండా ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతోంది. కేవలం అరెస్టులతో సరిపెట్టకుండా, ఇలాంటి అవినీతి తిమింగలాల ఆస్తులపై సమగ్ర విచారణ జరిపి, శాఖలో ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అడవి తల్లి సాక్షిగా జరుగుతున్న ఈ అక్రమ వసూళ్ల పర్వానికి చట్టం ఎప్పుడు చరమగీతం పాడుతుందో వేచి చూడాలి.

# ట్రాఫిక్ ఐలాండ్ వద్ద ఫాగింగ్ మిస్ట్ యంత్రాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

బోధన్ : మే 07 జన సంఘర్షణ

గురువారం మధ్యాహ్నం నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. వేసవికాలంలో తీవ్ర ఎండల ప్రభావంతో ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నగరంలో పలు కూడళ్ల వద్ద ఎండ తీవ్రతను తగ్గించడానికి ఫాగింగ్ మిస్ట్ యంత్రాలను ఏర్పాటు చేయించి కోర్ట్ సర్కిల్ వద్ద పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ ఏర్పాటు చేసినటువంటి మిస్ట్ యంత్రాల పనితీరును ట్రాఫిక్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. సుమారుగా మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు మిస్టి యంత్రాల ద్వారా ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చని వేసవి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని తెలిపినారు అదేవిధంగా ట్రాఫిక్ సిబ్బందికి ఎల్లవేళలా ఆరోగ్య రీత్య ఎదురయ్యే ఇవబందులను రాబోయే రోజులలో తగు చర్యలు తీసుకొని సంక్షేమం కోసం కృషి చేస్తారని తెలిపినారు. మిస్ట్ యంత్రాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన వాసవి క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, అశోక్ సిబ్బంది అనిల్, రహీం, నరేష్ షాకీర్, గాంధీ శంకర్లు పాల్గొన్నారు.




# సౌర విద్యుత్ కేంద్రాలపై రైతులకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన

బోధన్ మే 07 జన సంఘర్షణ

బోధన్ నియోజకవర్గం పరిధిలోని రైతు వేదిక, బోధన్ పట్టణంలోని , ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక. "రైతు వారం" వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, కార్యక్రమం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహనా, విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తల గురించి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే. నగేష్ కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, బోధన్ మాట్లాడుతూ ...సోలార్ పథకాలు పి.ఎమ్, కుసుము –ఎ స్కీం లో భాగంగా రైతులు బంజరు భూములలో సౌర విద్యుత్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకొని, ఉత్పత్తి అయిన విద్యుత్ ను డిస్కమ్ లకు విక్రయించడం వల్ల అదనపు ఆదాయము పొందవచ్చని తెలిపారు, రైతులు 0.5 మెగా వాట్స్ నుండి 2 మెగా వాట్స్ వరకు పై సౌర విద్యుత్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకోవచ్చు. తద్వారా సంవత్సరానికి సుమారు 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు సంపాదించవచ్చు అన్నారు. అలాగే పి.ఎమ్, కుసుము –సీ స్కీం లో భాగంగా రైతులు తమ వ్యవసాయ పంప్ సెట్లను 7.5 కిలో వాట్స్ సౌర శక్తి ప్యానెల్ ను ఏర్పాటు చేసుకొని, తమకు కావాలిసిన విద్యుత్ ను తామే ఉత్పత్తి చేసుకొని, మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కి సరఫరా చేసి అదనపు ఆదాయము దాదాపు 20,సంవత్సరానికి పొందగలరు. అలాగే గృహలలో రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలన్నరు. వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సేవలపై, సర్వీస్ లైన్ చార్జెస్ పై, అవగాహన కల్పించారూ. అలాగే జీరో ఆక్సిడెంట్ లక్ష్యముగా అందరూ రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త లు తీసుకోవాలని, నాణ్యమైన పరికారాలు వాడాలని, ఇంట్లో, మోటార్ ల వద్ద తప్పనిసరిగా ఎర్థింగ్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ ప్రమాదాలు నివరించాలని కోరారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలపాలని కోరారు. ఈ సమావేశం లో తిరుమల ప్రసాద్, జెడిఏ, నాయిని కృష్ణ, ఏ ఈ, బోధన్ టౌన్ 1 మారుతీ, బోధన్ రూరల్ వ్యవసాయ అధికారులు, విద్యుత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# బీజేపీ దాడిని ఖండించిన దిండిగాల రాజేందర్

ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)

ఖమ్మం: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ నాయకులు కార్యాలయంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టడంతో పాటు ఎమ్మెల్యే కారును ధ్వంసం చేసి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రోత్సాహంతోనే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని రౌడీయిజానికి పాల్పడుతున్న బీజేపీ నాయకులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం విచారకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలియజేయడానికి అనేక మార్గాలు ఉన్నప్పటికీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఈ ఘటన ద్వారా కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న స్నేహబంధం మరోసారి బయటపడిందని ఆరోపించారు. ఇలాంటి చిల్లర కార్యక్రమాలకు పాల్పడితే బీఆర్ఎస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని, అవసరమైతే ప్రతిదాడులకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. దాడిలో పాల్గొన్న వారితో పాటు ఈ ఘటనకు సూత్రధారులైన వారిపై కూడా పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఇటువంటి దాడులను ఖండించాలని విజ్ఞప్తి చేశారు.



# మాటుకాలువ కాల్వర్టుల కోరకు 32 లక్షల నిధులు మంజారు

- వ్యయంతో పనులు ప్రారంభించిన నాళేశ్వర్ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య
- మాటుకాలువ కాల్వర్టుల కొరకు నిధులు మంజారు చేసినా బోదన్ ఏమెల్యే సుదర్శన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రైతులు

బోధన్: మే 07 జన సంఘర్షణ



నవిపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో ఉన్న మాటుకాలువ కి ఎమ్‌జీఎన్‌ఆర్‌జీఎస్ నిధుల కింద 32 లక్షల వ్యయంతో రేండు స్లాప్ కల్వర్టులను బోధన్ ఏమ్మేల్యే సుదర్శన్ రెడ్డి మాంజూరు చేయించారు. కల్వర్టుల పనులకు ఈ రోజు నాళేశ్వర్ గ్రామ సర్పంచ్ ఆర్మురు లావణ్య కోబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్బంగా సర్పంచ్ ఆర్మూర్ లావణ్య మట్లాడుతూ ఆంకంపల్లి, నాళేశ్వర్ పంట పోలాల గుండా ఉన్నటువంటి మాటుకాలువ మట్టితో పుడుకుపోయి వర్షపు నీటితో పంట పోలాలు మునిగిపోవడంతో పాటు గ్రామంలోకి నీరు వస్తుందని బోదన్ ఎమ్మేల్యే పి.సుదర్శన్ రేడ్డి దృష్టికి తీసుకేల్లాడంతో వారు వెంటనే స్పందించి, మాటు కాలువ పూడిక తీతకు, ప్రత్యేక నిధులను, రెండు కల్వర్టుల నిర్మాణానికి ప్రత్యేక నిధులను మంజూరు చేయడం జరిగింది. అడిగిన వేంటనే నిధులు మాంజూరు చేసి పనులను ప్రారంభించేలా కృషి చేసినా ఏమ్మెల్యేకి రైతుల తరుపున గ్రామం తరుపున ప్రత్యేక దన్యావాదాలు తెలుపుతున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, సోసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, ఇరిగేషన్ డీఈ వేంకటేశ్వర్లు, ఏఈ జూబేర్, వార్డు సభ్యులు ఆర్మూర్ గణేష్, సుంకరి రాజు, మాజీ సర్పంచ్ మగ్గరి నర్సింగ్ రావు, గ్రామ ఆబివృది00 కమిటి సభ్యులు గంగాధర్, బోజారం, రాజేందర్, మేహన్, భోజేందర్, భూమయ్య, గంగారెడ్డి, గ్రామస్తులు లింగారేడ్డి, రాజేశ్వర్, పోతన్న, నవిన్, సాయిలు పోశేట్టి, లక్ష్మణ్, హన్మండ్లు తదితరులు ఉన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ మేనేజర్‌ను కలిసిన గుంపెళ్లగూడెం సర్పంచ్

సింగరేణి ప్రతినిధి : (జన సంఘర్షణ)

గుంపెళ్లగూడెం గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి – వీరబాబు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ భేటీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆధునిక మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీసీ రోడ్లు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సహకారం అందించాలని అభ్యర్థించారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి – వీరబాబు సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం అధికారులను కలిసి నిధులు తీసుకురావడంలో వారు ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సర్పంచ్‌పై గ్రామ ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్, పంచాయతీ సెక్రటరీ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# బోధన్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్గా శరత్ రెడ్డి

బోధన్: మే 07 జన సంఘర్షణ



బోధన్ మున్సిపల్ కౌన్సిల్లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్గా కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కె.నగేశ్ రెడ్డి వెల్లడించారు. పట్టణ అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, శరత్ రెడ్డి, కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు అధికారిక లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంకు దాము, రవి, రామరాజు, జహీర్, హనీఫ్, డబ్బు ఇమ్రాన్, శ్రీకాంత్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 16వ వార్డులో ఇందిరమ్మ పట్టాల పంపిణీ

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)

ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం 16వ వార్డు లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 16వ వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్రతో కలిసి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 16వ వార్డుకు 16 ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమని, ప్రస్తుతం వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని ఆమె విమర్శించారు. 16వ వార్డుకు ఇళ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడతలో కూడా 16వ వార్డుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే, చైర్మన్ ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్ సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం  తెలుగు దినపత్రిక
శుక్రవారం
08 మే 2026

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

❑ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యే పిలుపు

నిజామాబాద్ మే 07 : జన సంఘర్షణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా టాస్క్ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్, కామారెడ్డి లతో కూడిన ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తదితరులు విచ్చేసి, జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి



అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. సుమారు రెండు వేల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, మరికొందరికి అప్రెంటిస్ షిప్ ద్వారా శిక్షణ కోసం ఎంపిక చేశారని అన్నారు. ఈ తరహా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్యాలను పెంపొం దించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అందుకు గాను స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డివైఎస్ఓ పవన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఎన్ఐసీ అధికారి మధు, ఈ-డీఎం కార్తీక్, వంశీధర్ రెడ్డి, టాస్క్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్ దాడిపై హరిప్రియ నాయక్ నిప్పులు!

❑ అధికార మదంతో అరాచక రాజకీయాలా?

ఇల్లందు మే 07 (జన సంఘర్షణ)

ప్రజాస్వామ్యంలో ప్రశ్న ఉంటే సమాధానం చెప్పాలి కానీ, రాళ్లతో దాడి చేయడం ఏ రకమైన సంస్కృతి అని ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ నిలదీశారు. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరులు జరిపిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉండి, ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం, దానిని ప్రశ్నించిన పాడి కౌశిక్ రెడ్డిపై వీధి రౌడీల్లా భౌతిక దాడులకు దిగడం రాజకీయ పతనావస్థకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు. అధికార




పీఠంపై ఉన్నవారే హింసను ప్రోత్సహిస్తుంటే, ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ ఉంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పోలీసుల వైఖరిని ఆమె ఎండగడుతూ, పోలీసుల కళ్లముందే దాడులు జరుగుతున్నా మౌనం వహించడం చూస్తుంటే రాష్ట్రంలో 'లా అండ్ ఆర్డర్' అదుపు తప్పిందని స్పష్టమవుతోందన్నారు. హోం మంత్రి లేని రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలేశారని, అల్లరి మూకల అరాచకాలు పెచ్చరిల్లుతున్నాయని విమర్శించారు. దాడులతో భయపెట్టి బిఆర్ఎస్ గొంతు నొక్కలేరని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన పోరాటం ఆగదని ఆమె హెచ్చరించారు. విధ్వంసకర రాజకీయాలకు ప్రజలే త్వరలో బుద్ధి చెబుతారని, ప్రజాస్వామ్యవాదులంతా ఇలాంటి దాడులను ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు.

# చెమట చిందే పారిశుద్ధ్యం.. చేతికి అందని వేతనం

❑ గ్రామపంచాయతీ కార్మికుల కడుపుకోత!

ఇల్లందు మే 07 (జన సంఘర్షణ)

పల్లె సీమలను పచ్చగా, పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం శ్రమిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పరిస్థితి ఇప్పుడు 'దీపం కింద చీకటి'లా మారింది. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న ఈ అట్టడుగు శ్రామికులకు, గత రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో వారి జీవితాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గురువారం ఇల్లందు ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం సమర్పించి, ప్రభుత్వంపై సమరశంఖం పూరించింది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు లేకపోతే పల్లెలు రోగాల నిలయంగా మారుతాయని, అటువంటి కీలక బాధ్యతలు నిర్వర్తించే వారి పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ఐఎఫ్టియు నేతలు కొక్కు సారంగపాణి, తొగర సామ్యూల్ ధ్వజమెత్తారు. మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు కనీసం




నిత్యావసరాలు కొనుక్కోవడానికి కూడా అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, పథకాలు వస్తున్నా.. క్షేత్రస్థాయిలో చెమటోడ్చే కార్మికుడి కడుపు మాత్రం ఎండిపోతూనే ఉండటం వ్యవస్థలోని వైఫల్యానికి నిదర్శనం. సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరగడం కాకుండా, తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసన కేవలం వినతిపత్రానికే పరిమితం కాదని, వేతనాలు చెల్లించని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని ఐఎఫ్టియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రామికుడి శ్రమకు సరైన సమయంలో ప్రతిఫలం అందించని ఏ పాలకుడైనా, అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వారు పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లందు మే 07 (జన సంఘర్షణ)

స్థానిక సీఎస్పీ బస్తి గ్రామ పంచాయతీ పరిధిలో ఈరోజు ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మితిమీరిన వేగంతో వెళుతున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గుంపెల్లగూడెంకు చెందిన వృద్ధుడు అదృశ్యం

సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ)

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన మూడ్ పంతులు (60) అనే వ్యక్తి ఈ నెల 19వ తేదీ నుండి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఇంటి నుండి వెళ్లిన తర్వాత తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మూడ్ పంతులు ఆచూకీ గురించి ఎవరైనా సమాచారం తెలిసిన పక్షంలో వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని వారు కోరుతున్నారు. సమాచారం అందించిన వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతామని తెలిపారు.



సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 8466887259 , 9704734715

ప్రజలు ఈ సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా పంచి కుటుంబానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## టీఆర్ఎస్ యువనేత చిన్నబాబు వివాహానికి హాజరైన పార్టీ నాయకులు

ఇల్లందు ప్రతినిధి ( జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సి.ఎస్.పి గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ మండల యువజన నాయకులు చిన్నబాబు వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి ఇల్లందు టీఆర్ఎస్ పార్టీ మండల, నియోజకవర్గ నాయకులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, అజ్మీర బాబు సింగ్ నాయక్, వాంకుడోత్ అంజిబాబు, ఉపసర్పంచ్ హరిప్రసాద్ యాదవ్, ఆదూరి రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని నాయకులు ఆకాంక్షించారు.

## ఎల్లారెడ్డి ఎస్ఐగా రాజు బాధ్యత స్వీకారణ

ఎల్లారెడ్డి మే -7(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి ఎస్సైగా రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై బొజ్జ మహేష్ రాజాంపేట్ మండలంకు బదిలీ కావడంతో, రాజంపేట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజు బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.




## రెండవసారి మండల అధ్యక్షుడిగా సాయిబాబా

❑ సన్మానించిన వివిధ గ్రామాల సర్పంచులు

ఎల్లారెడ్డి, మే -7(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా రెండవ సారి ఎన్నికైన కురుమ సాయి బాబాకు గురువారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ..మీ పనితీరు కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ గుర్తించి రెండోసారి మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సన్మానించిన సర్పంచులకు మండల పార్టీ అధ్యక్షులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షునిగా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే మదన్మోహన్ కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విజయలక్ష్మి నగర్ అభివృద్ధిలో సర్పంచ్ రమేష్ బాబు ముందడుగు!

ఇల్లందు మే 07 (జన సంఘర్షణ)

పదవి అంటే అధికారం కాదు, అదొక బాధ్యత అని విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మరోసారి నిరూపించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామంలో మురుగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తాత్కాలిక కాలువల ఏర్పాటును యుద్ధప్రతిపాదికన పూర్తి చేశారు. కేవలం డ్రైనేజీ వ్యవస్థే కాకుండా, ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సరఫరాలో ఆటంకాలు కలగకుండా మిషన్ భగీరథ వాటర్ లైన్లకు శరవేగంగా మరమ్మతులు చేయించి తన పాలనా దక్షతను చాటుకున్నారు. నిధుల లేమి సాకులు చెప్పకుండా, ప్రజల కష్టాలను గుర్తించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఒక చిన్న గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులపై సర్పంచ్ చూపిస్తున్న శ్రద్ధ మిగతా పాలకులకు ఒక పాఠం లాంటిది. వ్యవస్థలో మార్పు రావాలంటే ఇలాంటి క్షేత్రస్థాయి నాయకత్వం ఎంతో అవసరమని స్థానికులు కొనియాడుతున్నారు.



## ప్రజాస్వామ్యంపై దాడి సిగ్గుచేటు!

◆ **ఖండించిన వనమా.. నిప్పులు చెరిగిన రాఘవ**



పాల్వంచ మే 07 (జన సంఘర్షణ)
రాజకీయాల్లో విమర్శలకు సమాధానం చెప్పలేక భౌతిక దాడులకు దిగడం పిరికిపంద చర్య అని కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ ఘాటుగా విమర్శించారు. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బండి సంజయ్ అనుచరులు జరిపిన అరాచక దాడిని వారు తీవ్రంగా ఖండించారు. కేంద్ర మంత్రి పదవిలో ఉండి బాధ్యతాయుతంగా మెలగాల్సిన వారే వీధి రౌడీలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన కేటీఆర్ గారు సంధిస్తున్న ప్రశ్నలకు బదులు చెప్పలేకనే ఈ దాడుల సంస్కృతికి తెరలేపారని వారు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, హోం మంత్రి లేకపోవడం వల్లే అల్లరి మూకలు స్వైరవిహారం చేస్తున్నాయని వనమా పితామహులు మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే ప్రజాప్రతినిధుల కార్యాలయాలపై దాడులు జరగడం చూస్తుంటే వ్యవస్థ ఎటువైపు వెళ్తోందో అర్థమవుతోందన్నారు. దాడులు, బెదిరింపులతో బిఆర్ఎస్ పార్టీ గొంతు నొక్కలేరని, ప్రజా సమస్యల కోసం పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. విధ్వంసకర రాజకీయాలకు ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారని, ప్రజాస్వామ్యవాదులంతా ఇలాంటి అరాచకాలను ఖండించాలని పిలుపునిచ్చారు.

## అల్లూరి స్ఫూర్తితోనే 'జల్-జమిన్-జంగిల్' పోరాటం!

◆ **కార్పొరేట్ వేటలో ఆదివాసీ అస్తిత్వం**



కొమరారం మే 07 (జన సంఘర్షణ)
విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు నేటికీ అడవి బిడ్డల గుండెల్లో రగులుతూనే ఉన్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన ఆ మహావీరుడి 102వ వర్ధంతిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొమరారంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ రాజకీయ వేడిని రగిల్చింది. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, గిరిజన చట్టాల నిర్వీర్యంపై నాయకులు గళమెత్తారు. నాటి బ్రిటీష్ దోపిడీకి నేటి కార్పొరేట్ శక్తుల అణచివేతకు పెద్దగా తేడా లేదని, ఆదివాసీల అస్తిత్వం నేడు ప్రమాదంలో పడిందని పార్టీ మండల సహాయ కార్యదర్శి మోతీలాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో అడవిని ఆదివాసీలకు దూరం చేస్తోందని నాయకులు ఆరోపించారు. గిరిజన బిడ్డను రాష్ట్రపతిని చేయడం కేవలం ప్రచారానికే పరిమితమైందని, వాస్తవానికి గిరిజన హక్కులను, పర్యావరణ చట్టాలను మంటగలుపుతూ ఖనిజ సంపదను బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఎన్కౌంటర్ల పేరిట సొంత పౌరులను చంపుతూ కొత్త రకం దేశభక్తిని ప్రదర్శిస్తున్నారని, రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. అడవిపై హక్కు ఆదివాసీలదేనని, అల్లూరి, గంటం దొరల స్ఫూర్తితో మరోసారి 'జల్–జమిన్–జంగిల్–ఇజ్జత్' కోసం సాయుధ పోరాటానికైనా సిద్ధం కావాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు.

## బోధన్ ఏక చక్రేశ్వర గోశాలకు పశు గ్రహసం విరాళం

బీర్కూర్/మే 7/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఏక చక్రేశ్వర గోశాలలో అగ్ని ప్రమాదం వల్ల 15 వేల గడ్డి కట్టలు కాలిపోయాయి. గోవులకు పశుగ్రాసం కరువైంది. దీనిని ఆలోచించి విషయం తెలుసుకుని గో సేవకుడు సితలే రమేష్ ద్వారా తెలుసుకుని బీర్కూర్ గ్రామం నుండి బోధన్ ఏక చకేరేశ్వర గోశాలకు సుమారుగా 25000 వేలా రూపాయల విలువ చేసే 350 గడ్డి (పశుగ్రాసం)కట్టలను మన గో సేవ దాతలు పిట్లం అశోక్ (బంగారం), శశికాంత్ పంపడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో గో సేవకులు సితలే రమేష్, శశికాంత్,కిట్టు, మెకానిక్ నాగు,శేఖర్, జూకంటి మల్లేష్ గ్రామ యువకులు పాల్గొన్నారు.

## రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నల్ల సాయిలు ఆర్థిక సాయం అందించిన కోటగిరి గ్రామస్తులు

కోటగిరి/మే 7/(జన సంఘర్షణ)



కోటగిరి మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నల్ల సాయిలు ( బంక్ సాయిలు) కుటుంబానికి గ్రామ పెద్దలు, మిత్ర బృందం బ్రాహ్మణ గల్లీ యువత కలసి 68,850 రూపాయలను ఆర్థిక సాయం అందించి మానవత దృక్పథాన్ని చాటుకున్నారు. సాయిలు కుటుంబానికి అన్ని వేళాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజు మహారాజ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, తెల్ల రవి కుమార్, కప్ప సంతోష్, కోయిగూర్ శ్రీనివాస్, కమ్మరి గగన్, వడ్ల రాజు, నాగభూషణం, అరుణ్ గౌడ్, యోగేష్, నరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి చర్చలు వద్దు.. చట్టాన్ని అమలు చేయండి

◆ **అలంకారప్రాయంగా పీస్ మీటింగులు: ఇల్లందులో పోలీసులకు హిందూ సంఘాల అల్టిమేటం!**

ఇల్లందు మే 07 (జన సంఘర్షణ)
శాంతి కమిటీ సమావేశాలు కేవలం ఫోటోలకు, ఫైళ్లకే పరిమితమవుతున్నాయా? క్షేత్రస్థాయిలో చట్టం అమలు కానప్పుడు ఈ తూతూమంత్రపు చర్చల వల్ల ప్రయోజనం ఏమిటి? ఇవే ఇప్పుడు ఇల్లందులో సెగలు రేపుతున్న ప్రశ్నలు. బక్రీద్ పండగ వేళ పోలీస్ శాఖ నిర్వహించిన పీస్ మీటింగ్‌ను హిందూ సంఘాలు ముక్తకంఠంతో బహిష్కరించి, తమ నిరసనను గళమెత్తాయి. ఇది కేవలం ఒక సమావేశాన్ని వదిలి వెళ్లడం కాదు, వ్యవస్థీకృత వైఫల్యంపై విసిరిన సవాల్. పోలీస్ యంత్రాంగం పై అధికారులకు నివేదికలు పంపుకోవడానికి, రికార్డుల్లో 'అంతా సవ్యంగా ఉంది' అని చూపించుకోవడానికి ఈ సమావేశాలను ఒక అలంకారప్రాయంగా వాడుకుంటున్నారని హిందూ సంఘాలు ఆరోపించాయి. శాంతి అనేది రెండు వర్గాల మధ్య సమానంగా ఉండాలి కానీ, ఒక వర్గానికి మినహాయింపులు ఇస్తూ, మరొక వర్గాన్ని నియంత్రించేలా ఉండకూడదని వారు ఘాటుగా విమర్శించారు.



ముసుగులో జరిగే ముచ్చట్ల కంటే, చట్టం అమలులో చూపే చిత్తశుద్ధి మిన్న అని వారు స్పష్టం చేశారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటే, హిందూ సంఘాల ఆగ్రహంలో అర్థం కనిపిస్తోంది. సుమారు 50కి పైగా గోవులను అక్రమ తరలింపు నుంచి హిందూ సంఘాల సభ్యులే స్వయంగా రక్షించినా, ఆ రాత్రి వేళ డయల్ 100కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి స్పందన కరువైంది. రక్షించాల్సిన వారే మౌనం వహిస్తే, సామాన్య పౌరుడు ఎవరికి మొరపెట్టుకోవాలి? ఈ ఉదాసీనతే నేడు వ్యవస్థపై నమ్మకం సడలిపోయేలా



**2024 సంవత్సరం బక్రీద్ రోజు**

చేసింది. ప్రతి ఏటా పీస్ మీటింగ్‌లో గోవధ చేయబోమని హామీ ఇవ్వడం, తీరా సమయం వచ్చాక ఆ మాట తప్పడం ఒక అలవాటుగా మారిందని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాటల గారడీతో పబ్బం గడుపుకోవడం కాకుండా, గోవధ నిషేధ చట్టాన్ని తూచా తప్పకుండా అమలు చేసే ధైర్యం పోలీస్ శాఖకు ఉందా అని వారు ప్రశ్నించారు. చట్టాన్ని గౌరవించని పక్షంలో చర్చలకు అర్థం లేదని వారు తేల్చి చెప్పారు. ముఖ్యంగా, గోవధ నిషేధ చట్టం–1977 గురించి ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఈ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గోవులను లేదా దూడలను వధించడం పూర్తి నిషిద్ధం. కేవలం వ్యాధిగ్రస్తమైనవి లేదా వయసు పైబడిన కొన్ని జంతువులకు మాత్రమే ప్రత్యేక అనుమతులు ఉంటాయి. కానీ, బక్రీద్ సమయంలో ఈ చట్టం నిబంధనలు గాలికి ఎగురుతున్నాయని, దీన్ని అరికట్టడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందని హిందూ సంఘాలు కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులకు విన్నవించనున్నాయి. చట్టం తన పని తాను చేయాలి. 1977 చట్టం ప్రకారం గోవధకు పాల్పడే వారికి జరిమానాతో పాటు కఠిన కారాగార శిక్ష కూడా విధింపబడుతుంది. కానీ, క్షేత్రస్థాయిలో అక్రమ రవాణా జరుగుతున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం



**2025 సంవత్సరం బక్రీద్ కి ఒక రోజు ముందు**

పొగ గో ప్రేమికుల పైన బెదిరింపుల వల్లనే నేడు పీస్ మీటింగ్‌లు బహిష్కరించే పరిస్థితి ఏర్పడింది. కేవలం శాంతిని కోరుకోవడం కాదు, ఆ శాంతికి మూలమైన న్యాయాన్ని రక్షించడం కూడా అంతే ముఖ్యం. కేవలం హిందూ సంఘాలను నియంత్రించడంపైనే పోలీస్ శాఖ దృష్టి పెడుతోందని, గోరక్షణ కోసం ప్రయత్నించే వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు మండిపడ్డారు. పీస్ మీటింగ్ అనేది కేవలం 'గోవధ నిషేధ చట్టం–1977' అమలుపై చర్చించడానికి నిర్వహిస్తేనే తాము పాల్గొంటామని వారు కరాకండిగా చెప్పారు. వ్యవస్థలో మార్పు రానంత వరకు ఈ ఫోటో సెషన్లకు తాము దూరం అని వారు ప్రకటించారు. ఇల్లందులోని అన్ని హిందూ సంఘాలు ఐక్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం ఒక సామాజిక చైతన్యానికి నిదర్శనం. చట్టం అనేది అందరికీ సమానంగా వర్తించినప్పుడే సమాజంలో నిజమైన శాంతి వర్ధిల్లుతుంది. కేవలం పండుగల ముందు మొక్కుబడి సమావేశాలు నిర్వహించడం మానేసి, ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం అక్రమ గోవధపై ఉక్కుపాదం మోపాలని, 1977 చట్టాన్ని గౌరవించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రజాస్వామ్య దేవాలయంపై రౌడీ మూకల దాడి

◆ **లావుడ్యా సత్యనారాయణ నాయక్ నిప్పులు!**



కొత్తగూడెం మే 07 (జన సంఘర్షణ)
రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం, కానీ అధికారం అండతో భౌతిక దాడులకు దిగడం అరాచకత్వానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ మండిపడ్డారు. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు జరిపిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికైన, ఒక దేవాలయం వంటి ఎమ్మెల్యే కార్యాలయంపై రాళ్లు, రాడ్లతో దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ గారు తన అనుచరులను ఉసిగొల్పి ఇలాంటి హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహించడం దేశానికే గొడ్డలి పెట్టు అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, సాక్షాత్తు ఒక ప్రజాప్రతినిధి కార్యాలయంపై పట్టపగలు దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని సత్యనారాయణ నాయక్ నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లా అండ్ ఆర్డర్‌ను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేని చోట సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో దొంగతనాలు, అత్యాచారాలు, గుండాయిజం పెచ్చుమీరిపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతే కారణమని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని, ఆ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుంటే తట్టుకోలేకనే ఈ దాడులకు పాల్పడుతున్నారని సత్యనారాయణ నాయక్ విశ్లేషించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన నిలబడి అలుపెరుగని పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన బీజేపీ రౌడీ మూకలను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు అంటే దాడులు చేయడం కాదు, దేశాభివృద్ధి కోసం, నిరుద్యోగ నిర్మూలన కోసం పరితపించాలని హితవు పలికారు. హామీలను విస్మరించి, అరాచక పాలన సాగిస్తున్న పాలకులకు ప్రజలే సరైన సమయంలో గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. తెలంగాణ సమాజం శాంతిని కోరుకుంటుందని, ఇలాంటి విధ్వంసకర సంస్కృతి రాష్ట్ర ప్రగతికి ఆటంకమని సత్యనారాయణ నాయక్ పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కక్ష సాధింపులు మానుకుని, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, అరాచక శక్తులను ప్రజల ముందు ఎండగడుతూనే ఉంటుందని ఆయన దృఢంగా ప్రకటించారు.

## బోధన్‌లో బక్రీద్ పండుగ నేపథ్యంలో ముస్లిం మత పెద్దలతో పోలీస్ కమిషనర్ సమావేశం






బోధన్: మే 07 జన సంఘర్షణ
బక్రీద్ పండుగను శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు , మసీదు కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్ యందు నిర్వహించారు. ఈ సమావేశంలో పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ప్రజల సహకారం, శాంతి భద్రతల పరిరక్షణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. బక్రీద్ వంటి ముఖ్యమైన పండుగలను పరస్పర గౌరవంతో జరుపుకోవడం సమాజంలో ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ రోజుల్లో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని , ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద సమాచారం గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. పండుగ రోజుల్లో ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పోలీస్ శాఖ చర్యలను అభినందిస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొని తమ తమ సూచనలు వెల్లడించారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖ, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాటించ వలసిన వారికి నిబంధనలను వివరించి వారి నుండి సలహాలు కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి ( అడ్మిన్ ) శుభం ప్రకాష్, బోధన్ ఎసిపి శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, బోధన్ ఎస్‌హెచ్ఓ వెంకట నారాయణ, బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, రుద్రూర్ సిఐ శ్రీ కృష్ణ, బోధన్ మనోజ్, హబీబ్, బోధన్ రూరల్ ఎస్.ఐ మచ్చేందేర్ రెడ్డి, ఎడపల్లి ఎస్ఐ రమ, వర్ని ఎస్.ఐ వంశీ కృష్ణ రెడ్డి , రెంజల్ ఎస్ఐ చంద్ర మోహన్ , ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, కోటగిరి ఎస్ఐ సునీల్, మున్సిపల్ వైస్ చెర్మన్ ఇలియాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా , ముస్లిం మత పెద్దలు ఖురేషిలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దోపిడీలకు గురి చేస్తే... రైస్ మిల్లులు సీజ్ చేస్తాం

◆ **బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఘాటు హెచ్చరిక**

బాన్సువాడ /మే 7/(జన సంఘర్షణ)

అరగాలం శ్రమించి పండించిన పంట దాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ అధికారులతో కలిసి కొంతమంది రైస్ మిల్లర్లు దోపిడీక పాల్పడుతున్నారని రైతులు గురువారం సాయంత్రం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ముందు తమ గోడు వినిపించుకున్నారు. వెంటనే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి సంబంధిత శాఖ అధికారులకు హెచ్చరించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో తరుగు పేరిట దోపిడీలకు పాల్పడితే ఆ రైస్ మిల్లులను సీజ్ చేయండి అంటూ బాన్సువడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఘాటుగా హెచ్చరించారు. రైతు లేనిదే రాజ్యం లేదు, రైతులు బాగుంటే దేశం బాగుంటుంది అలాంటి అన్నదాతలను నిలువునా మోసగించడానికి రైస్ మిల్లర్లకు ఎలా ఆలోచన వస్తుంది అంటూ ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. తన నియోజకవర్గంలో ఎక్కడైనా ఏ నాయకుడైనా, ఏ ప్రజా ప్రతినిధి అయిన తన రైస్ మిల్లులలో అన్నదాతలను దోపిడీకి పాల్పడడానికి ప్రయత్నం చేస్తే ఆ రైస్ మిల్లులను తక్షణం సీజ్ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. రైతులను మోసగించడానికి కొంతమంది అధికారులు అధికారులు, రైస్ మిల్లర్లు కలిసి దోసుకుంటున్నారని రైతులు తమ ఆవేదన వెళ్లగక్కారు. రైతుల ఆవేదన విన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ధన్య గారంగా పేరుగాంచిన బాన్స్వాడ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఇక్కడ వరి నాట్లు, వరి కోతలు ముందే వస్తాయని పోచారం వెల్లడించారు. ఆ దేవుని దయవల్ల అకాల వర్షాలు ఈ ప్రాంతంలో కుర్రకపోవడం వల్ల అన్నదాత పండించిన పంట ఆశించిన రీతిలో దిగుబడులు రావడంతో అన్నదాత ఒకవైపు సంబరంగా ఉండగా, మరొకవైపు రైస్ మిల్లర్లు దోపిడీకి పాల్పడడంతో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా రైస్ మిల్లర్లపై మండిపడ్డారు. రైతులను దోచుకుంటే ఎవరినైనా ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. ఫోన్ ద్వారా



సంబంధిత శాఖ అధికారులకు ,రైస్ మిల్లర్లు వేధిస్తున్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండనక, వాననక, చలి అనక భార్య పిల్లలను వదిలి పంట పండిస్తే ఆ పంటను అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే అక్కడ తరుగు పేరిట రైతులను నిలువునా దోచుకోవడం సమంజసం కాదు అంటూ పోచారం మరోసారి మండిపడ్డారు. ఇకనుంచి తానే స్వయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అక్కడ గిట్ల లోపాలు వెలుగు చూస్తే వెంటనే సంబంధిత అధికారులతో పాటు, రైస్ మిల్లులు సీజ్ చేయడం జరుగుతుందని పోచారం పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

# ముచ్చటగా మూడోసారి బీర్కూర్ సొసైటీ చైర్మన్‌గా కొల్లి గాంధీ ప్రమాణస్వీకారం

బీర్కూర్./మే 7/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ముచ్చటగా మూడోసారి చైర్మన్ బాధ్యతలు కొల్లి గాంధీ చేపట్టారు. కొల్లి గాంధీసహకార సంఘంగా చైర్మన్గా ఉంటూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఉత్తమ సహకార సంఘంగా తీర్చిదిద్దారు. ఒక నయ పైసా జీతం తీసుకోకుండా ఉచితంగా సేవ అందించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బాన్స్వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కొల్లి గాంధీకి బీర్కూర్ సహకార సంఘం చైర్మన్గా నియమించారు. గురువారం రైతుల, కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తలు, సమక్షంలోకొల్లి గాంధీ సోసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ



కార్యక్రమంలో స్థానిక నాయకులు, సొసైటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్‌కు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియజేశారు. రైతుల సంక్షేమం కోసం, సొసైటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన మన దినపత్రిక ప్రతినిధితో వెల్లడించారు. అవినీతికి తావు కల్పించకుండా రైతులందరికీ అండగా ఉంటానని ఆయన వెల్లడించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తనపై నమ్మకంతో బీర్కూర్ సహకార సంఘం చైర్మన్గా నియమించినందుకు గాంధీ, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# బిజెపి బహిరంగ సభను జయప్రదం చేయాలని వాల్ పెయింటింగ్ ద్వారా ప్రజలకు పిలుపునిచ్చిన రాజ్య సభ ఎం.పీ డా కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటిబ్యూరో /మే 7( జనసంఘర్షణ )

మే 10వ తేదీన తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసి, బిజెపి బహిరంగ సభలో పాల్గొనున్న మన దేశ ప్రధాని ' నరేంద్ర మోడి కి' ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిస్తు.. గురువారం బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ సమీపంలోని జవహర్ స్కూల్, అశోక్ నగర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వాల్ పెయింటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎం.పీ డా కె.లక్ష్మణ్ పాల్గొని, చెలో పేరెడ్ గ్రౌండ్ "దేశం కోసం మోడీ...మోడీ కోసం మనం" అనే నినాదాన్ని వాల్ పెయింటింగ్ ద్వారా ఆవిష్కరించారు. మోడీ బిజెపి బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుండి మేధావులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్ళి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్ గౌడ్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, సత్తి రెడ్డి, శ్రీనివాస్ ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, నీరజ్, ప్రశాంత్, శేషి కాంత్ తదితరులు పాల్గొన్నారు.




# కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

◆ **బానోత్ హరిప్రియ నాయక్**

ఇల్లందు ప్రతినిధి: (జన సంఘర్షణ )

కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలను ఖండించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంపై బండి సంజయ్ అనుచరులు దాడి చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వీధి రౌడీల్లా వ్యవహరిస్తూ కార్యాలయంపై దాడులు చేసి భయానక వాతావరణాన్ని సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్నవారే హింసను ప్రోత్సహించడం ఆందోళనకరమని, పోలీసులు మౌనం వహించడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. హోంమంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పిందని, ఇటువంటి అల్లరి మూకల దాడులు పెరుగుతున్నాయని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు జరిగినా బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని, విధ్వంసక రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని పేర్కొన్నారు.



# తిర్మలాపూర్ గ్రామం నుంచి బోధన్ గోషాలకు 200 గడ్డిమోపులను గ్రామ పెద్దలు దాతలు

పొతంగల్/మే 7/(జన సంఘర్షణ)



పొతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామం నుంచి బోధన్ గోషాలకు 200 గడ్డిమోపులను గ్రామ పెద్దలు దాతలు ముందుకొచ్చి ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, రాజు పటేల్, హౌగిరి రావు, విజయ్ కుమార్, పబ్బ శేఖర్, కాశయ్య, సంజీవ్, సాయి కృష్ణ, లక్ష్మణ్, జగన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ గోశాలలో గోవులకు గడ్డి మేత కట్టలు అగ్ని ప్రమాదానికి గురి

కోటగిరి/మే 7/(జన సంఘర్షణ)




బోధన్ నియోజకవర్గం గత వారం రోజుల క్రితం బోధన్ గోశాలలో గోవులకు సంబంధించినటువంటి గడ్డి కట్టలు అగ్ని ప్రమాదానికి గురి కావడం జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని కోటగిరి గ్రామానికి చెందిన సుంకిని శీను పటేల్ గారు గోశాలకు సంబంధించిన గోవుల కోసం 500 గడ్డి కట్టలు ఈరోజు బోధన్ లోని ఏక చక్ర గోశాలకు పంపియడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల అధ్యక్షుడు ఏముల, నవీన్, సాయి గౌడ్ జానకి రాముడు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# 42 క్వింటాల పిడిఎస్ ప్రభుత్వ బియ్యం పట్టివేత


రుద్రూర్/మే 7/(జన సంఘర్షణ)



రుద్రూర్ మండల కేంద్రంలోని జెయనీసు కాలనీలో షర్ఫుద్దీన్ ఇంట్లో పిడిఎస్ నిల్వ ఉంచారని పక్క సమాచారం మేరకు పోలీసులు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న 42 క్వింటాల పిడిఎస్ బియ్యం స్వాధీనం పరుచుకొని షర్ఫుద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

# జిపి కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : ఐఎఫ్టియు

ఇల్లందు, మే 7: ప్రతినిధి( జన సంఘర్షణ )



గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో గురువారం ఇల్లందు ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తొగర సామ్యూల్ మాట్లాడుతూ గత మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చాలీచాలని వేతనాలతో గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు ఇల్లందు ఏరియా కమిటీ అధ్యక్షులు రావూరి ఉపేందర్ రావు, తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామండ్ల మోహన్ రావు, మండల అధ్యక్షులు రామిశెట్టి నరసింహారావు, మండల నాయకులు బానోత్ భీముడు, దనసరి వంశీ, అజ్మీర శ్రీను, సూర్ణపాక ప్రవీణ్, పడిగ కోటి తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
08 మే 2026

# జాతీయస్థాయిలో బంగారు ,వెండి ,కాంస్య పథకాలు సాధించిన మేకల హేమలత

**- అభినందిస్తూ క్రీడాకారిణి హేమలతను వారి తల్లిదండ్రులను సన్మానించిన కోచ్ బి గోపాలం, కోళ్ల వెంకటేష్ లు**

మక్తల్, మే 7

జాతీయస్థాయిలో బంగారు ,వెండి ,కాంస్య పథకాలు సాధించిన మేకల హేమలతను అభినందిస్తూ క్రీడాకారిణి హేమలతను వారి తల్లిదండ్రులను నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ బి గోపాలం, కోళ్ల వెంకటేష్ లు గురువారం మక్తల్ పట్టణంలో సన్మానించారు.నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణంలోని యాదవ నగర్ వీధికు చెందిన మేస్త్రి మేకల ఆంజనేయులు మణెమ్మ ఏకైక కూతురు హేమలత ఊట్కూర్ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ, విశ్రాంత పీఈటి బి.గోపాలం దగ్గర శిక్షణ పొంది, 2025 ఆగస్ట్ రెండో వారంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని క్రీడా ప్రతిభని చాటి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికై,2025 ఆగస్టు చివరి వారంలో బీహార్ రాష్ట్రం బుద్ధ గయ లో జరిగిన జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని వెండి పతకము సాధించినది. అలాగే గత జులైలో హైదరాబాదులో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ పది కిలోమీటర్ల రోడ్డు స్పీడ్ సైకిలింగ్ పోటీలలో పాల్గొని నాలుగో స్థానం పొంది ప్రశంసా పత్రం పొందినది. అలాగే2026 గత మార్చి 1న సిద్దిపేట జిల్లా కేంద్రం అడవిలో జరిగిన రాష్ట్రం



నలుమూలల నుండి 86 మంది పాల్గొన్న పది కిలోమీటర్ల మౌంటెన్ సైకిలింగ్ పోటీలలో నారాయణపేట జిల్లా నుండి హేమలత పాల్గొని అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొంది వెండి పతకం, ప్రశంసా పత్రం పొందిన సందర్భంగా నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోచ్ బి గోపాలం, కోళ్ల వెంకటేష్ జాతీయస్థాయిలో బంగారు ,వెండి ,కాంస్య పథకాలు సాధించిన మేకల హేమలతను, తల్లిదండ్రులను ఈనెల మక్తల్



యాదవ నగర్ లోని గోపాలస్వామి గుడిలో ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే కోచ్ బి గోపాలం ను హేమలత తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బి.గోపాలం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్పోర్ట్స్ కోటాలో పై చదువుల కొరకు, ఉద్యోగాల కొరకు సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమలత తల్లిదండ్రులు మేకల ఆంజనేయులు మణెమ్మ, కోళ్ల వెంకటేష్, గుంతల శివకుమార్, మేస్త్రి జి. శివకుమార్, మూర్తి, కురువ బుడ్డప్ప, కావలి మన్నెమ్మ, పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్ ల దగ్గర అప్రమత్తంగా ఉండాలి

**: డీఎస్పీ నల్లపు లింగయ్య**

**ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలి, నెంబర్లను రిజిస్టర్ లో నమోదు చేయాలి**



మక్తల్,మే 7

రబి సీజన్ లో వరి కొనుగోళ్ల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం రాకుండా నిరోధించేందుకు, అలాగే బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా పరిధిలో మొత్తం ఏడు చెక్పోస్టను ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కర్ణాటక, నారాయణపేట బోర్డర్ లోని కృష్ణ బోర్డర్ చెక్పోస్టును డిఎస్పీ నల్లపు లింగయ్య తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను, సిబ్బందిని



పరిశీలించి పలు సూచనలు చేశారు.

**ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ...**

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే వీడియో రికార్డింగ్తో తనిఖీలు కొనసాగించాలని సూచించారు.అదేవిధంగా సరిహద్దు మార్గాలన్నింటిపై నిరంతర నిఘా ఉంచి, గ్రామీణ మార్గాలు సహా అన్ని ప్రవేశ దారుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేయాలని తెలిపారు. అక్రమంగా వరి ధాన్యం రాకుండా, పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చెక్పోస్ట వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తగినంత మంచినీరు తీసుకోవాలని, వేడి నుండి రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని డీఎస్పీ స్పష్టం చేశారు. డీఎస్పీ తో పాటు కృష్ణ ఎస్సై రావీ నవీద్ ఉన్నారు.

# ఒండ్రు మట్టి పనులను రైతులు వినియోగించుకోవాలి

**- ఉప సర్పంచ్ ఎల్కోటి చెన్నప్ప**

మక్తల్,మే 7

ఉపాధి హామీ పనుల్లో భాగంగా అవసలోనిపల్లి గ్రామ శివారులో గుంత చెరువులో ఒండ్రుమట్టి తీసే పనిని గురువారం గ్రామ ఉపసర్పంచ్ వెల్కోటి చెన్నప్ప, పంచాయతీ కార్యదర్శి మాధురిక ,ఈసీ మైపాల్ రెడ్డి,కూలీలకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నప్ప కార్యదర్శి మాధురి మాట్లాడుతూ జాబు కార్డు ఉన్న ప్రతి కూలీ ఇ ట్టి పనుల ఉపయోగించి లబ్ధి పొందాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మక్తల్ మినీ స్టేడియంను పరిశీలించిన అధికారులు

మక్తల్, మే 7



మక్తల్ పట్టణంలోని గ్రౌండ్ ఆవరణలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవతో రూ.20 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న మినీ స్టేడియం పనులను గురువారం ఎస్ ఈ శ్రీనివాసరెడ్డి, డి ఈ ఉపేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ అల్యూరి పావ ని మాట్లాడుతూ... మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో..20 కోట్ల రూపాయలతో పూర్తి అధు నాతన స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ ట్రాక్, షటిల్, వాకింగ్ ట్రాక్ , వాలీబాల్ ఇతర అన్ని విభా గాలను ఏర్పాటు చేస్తూ అత్యంత భారీ స్థాయిలో మినిస్ట్రీయం ఏర్పాటుకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్, ఏఈ అశోక్, ఆనంపల్లి రాము, వల్లంపల్లి మధు, గురురాజ్ ,ప్రవీణ్ కుమార్, వినయ్, శ్రీహరి, పాండు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 5 వ డివిజన్ లో పర్యటించిన నగర కమీషనర్

**:- సెల్ఫ్ ఎన్యుమరేషన్ పై అవగాహన**



రామగుండం,మే 7 -

5వ డివిజన్ పరిధిలోని గంగానగర్లో గురువారం స్థానిక కార్పొరేటర్ మాటూరి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నగర కమిషనర్ అరుణ శ్రీ పర్యటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై కమిషనర్ ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను ఎస్ ఈ లో నమోదు చేసుకోవాలని,దీనివల్ల ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతాయని ఆమె వివరించారు.అలాగే డివిజన్లోని పలు దీర్ఘకాలిక ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co

# గంప మల్లేశం గుప్తా స్మారకార్థం అంబలి వితరణ.

**- దౌల్తాబాద్లో అంబలి వితరణ**

**గంప మల్లేశం గుప్తా స్మారకార్థం ప్రజలకు చల్లని అంబలి పంపిణీ.**








**దౌల్తాబాద్ మే 7**

వేసవి తీవ్రత అధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించేందుకు దౌల్తాబాద్లో అంబలి వితరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గతంలో శ్రీ బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ మాదంశెట్టి భద్రయ్య ఆధ్వర్యంలో ప్రారంభమైన అంబలి పంపిణీ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోంది.అందులో భాగంగా గురువారం గంప కుటుంబ సభ్యుల సౌజన్యంతో అంబలి వితరణ నిర్వహించారు. గంప మల్లేశం గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గంప మమత రవిగుప్త, హరిత వెంకటేష్, సంతోష్, సతీష్ కుటుంబ సభ్యులు స్వయంగా ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. తమ తండ్రి సేవా భావాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని అంబలి అందించడం ఆనందంగా ఉందన్నారు.

# ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**:- నగర మేయర్ మహంకాళి స్వామి**






**రామగుండం,మే 7 :-**

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు.ఈ మేరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యానికి తోడు ప్లాస్టిక్ కారణంగా స్థానికులు క్యాన్సర్ వంటి రోగాలతో అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు.శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో వెలువడుతున్న చెత్తలో ఎక్కువ శాతం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వెలువడుతున్నాయని,ప్లాస్టిక్ పై యుద్ధం ప్రకటించి నిషేధం పకడ్బందీగా అమలు చేస్తే ఈ సమస్య ఉండదని,ప్రతి వ్యాపార సంస్థ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై బోర్డులు ప్రదర్శించాలని తెలిపారు.నిషేధం ఉల్లంఘించినవారి నుండి నిస్సంకోచంగా జరిమానా వసూలు చేయాలని,ఫంక్షన్ హాళ్ల నుండి ప్లాస్టిక్ చెత్త వెలువడుతున్నందున నోటీసులు జారీ చేయాలని ఈ రోజు నుండి జరిమానాలు వసూలు చేయడం ప్రారంభించాలని తెలిపారు.ప్లాస్టిక్ నిషేధం అమలులో చురుగ్గా పని చేసినవారికి ప్రోత్సహకం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎసిపి శ్రీహరి,టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్,సానిటరీ ఇన్స్పెక్టర్ నాగభూషణం,వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్ లు,జవాన్లు

# కొత్తవారిపేట లో కమ్యూనిటీ కాంటాక్ట్

**:- సైబర్ మోసాలు,ట్రాఫిక్ భద్రత,డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన**



**రామగుండం,మే 7 :-**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయం మందమర్రి సీఐ పర్స రమేష్,కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తవారిపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 38 ద్విచక్ర వాహనాలు,2 ఆటోలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. అదేవిధంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు భద్రత, సైబర్ మోసాల నివారణ,శాంతిభద్రతల పరిరక్షణపై అవగా హన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ,సైబర్ మోసాలు మరియు సోషల్ మీడియా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులను ఓపెన్ చేయకూడదని,ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని తెలిపారు.ఫేక్ కాల్స్,ఫిషింగ్ సందేశాలు,సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,హెల్మెట్ ధరించడం,సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరి అని,మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 సేవలను వినియోగించాలని,గంజాయి మరియు మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని,గంజాయి,డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి, సమాజానికి హానికరమని,యువత ఈ అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.రైతులు నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ధృవీకరించిన విక్రేతల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.బాల్య వివాహాలు,వరకట్నం వంటి సామాజిక దుష్ప్రవర్తనలను నిరోధించాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం స్వీయరక్షణ మరియు నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు.గ్రామాల ప్రవేశ,నిష్క్రమణ ప్రాంతాల్లో అలాగే ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను తగ్గించడంతో పాటు భద్రతను పెంచవచ్చని వివరించారు.

# ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

**బ్యాంకు అధికారులతో ఎంపిక ప్రక్రియ నిర్వహణ.**



**దౌల్తాబాద్,మే 7**

ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు హాజరై తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించారు. బ్యాంకు అధికారులు లబ్ధిదారుల అర్హతలు, ప్రతిపాదించిన యూనిట్ల సాధ్యత, ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అఫ్జలోద్దీన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, ఎంపికైన వారికి బ్యాంకుల ద్వారా త్వరలోనే రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు.

# 16వ వార్డులో బోర్ మోటార్ రిపేరు చేయించిన వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని

**మక్తల్, మే 7**



మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులోని ప్రధానా ఏరియాలో గురువారం బోరు రిపేర్ కాగా బోర్ రిపేర్ చేయడంతో పాటు స్టార్ బాక్స్, ట్యాంకు పైప్ లైన్ పలను పూర్తిగా నూతనంగా అమర్చి, స్థానికులకు వేసవి సమయంలో నీటి ఎద్దడి లేకుండా స్థానిక వార్డ్ కౌన్సిలర్ అల్కూరి పావని చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా స్థానికులు వార్డు కౌన్సిలర్ కు ధన్యవాదాలు తెలిపారు. 16వ వార్డు పరిధిలో మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్, స్థానిక నాయకులు రామ్ నారాయణ, రమేష్, మధు, గురు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా కేంద్రానికి రాక

**- మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన సదస్సు**

**- జిల్లా లోని మాత్స్య సహకార సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు,సభ్యులు జిల్లా ముదిరాజ్ నాయకులు, మాత్స్య కారులు అందరూ ఆహ్వానితులే**

**- జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్**

**నారాయణపేట, మే 7**




మత్స్యకారుల సంక్షేమం మరియు మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించుటకు నిర్వహించబడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి నారాయణ పేట జిల్లా లోని మాత్స్య సహకార సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సభ్యులు మరియు జిల్లా ముదిరాజ్ నాయకులు, మాత్స్య కారులు నేడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ సిం గారం ఎక్స్ రోడ్ దగ్గర ఉదయం 9 గంటలకు నుండి జరగబోవు కార్యక్రమానికి విచ్చేసి విజ యవంతం చేయవలసిందిగా జిల్లా మత్స సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమ అభివృద్ధి,క్రీడలు యువజన సేవలు మాత్స్య శాఖ మంత్రి వర్యులు విచ్చేయుచున్నారు కావున